విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 14, సెప్టెంబరు 2024

మహిళల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జయసూర్య

విశాలాంధ్ర, నందికొట్కూరు : మహిళల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయ మని ఎమ్మెల్యే జయ సూర్య అన్నారు. శుక్రవారం పట్టణం లోని పొట్టి శ్రీరా ములు సర్కిల్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ స్మాల్ మార్కెట్‌ను ఎమ్మెల్యే జయ సూర్య మునిసిపల్ కమిషనర్ బేబీతో కలిసి రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్లో ఉన్న వివిధ రకాల వస్తువులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కొందరు ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటిని కొనుగోలు చేశారు. మెప్మా టీఎంసీ శాంతకుమారి తన సిబ్బందితో ఎమ్మెల్యేను, కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్నరాజు, భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముర్తుజావలి, టిడిపి నాయకులు లాయర్ జాకీర్, జమీల్, నిమ్మకాయల మోహన్, రగడ, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాలస్వామి, రాజన్న, జనసేన నాయకులు రామిరెడ్డి, ఎమ్మార్పీఎస్ డాక్టర్ రాజు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాగు కష్టాలు

- చాగలమర్రి అడ్డవాగు వరద నీటిలో రైతుల అష్టకష్టాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొలాలకు పయనం
- వంతెన నిర్మాణానికి ఎదురు చూపు

చాగలమర్రిలో అడ్డవాగు నుంచి పంట పొలాలకు వెళ్తున్న రైతులు, కూలీలు

విశాలాంధ్ర-చాగలమర్రి ..చాగలమర్రి గ్రామ సమీపంలోని గోపాయపల్లె రహదారి వద్దగల అడ్డవాగు వరద నీటిని దాటేందుకు రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. వాగు సమీపంలో వేల ఎకరాల్లో కంది, మినుము, మల్లె, జొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట పొలాలను నమ్ముకొని సుమారు 500 మందిరైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు. వర్షపు నీరు, టీజీపీ లీకేజీ నీరు కలిసి అడ్డవాగుకు చేరడంతో రైతులు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లలేక, పంటలను కాపాడుకోలేక నష్టపోతున్నారు. పండించిన పంటలు ఇంటికి తీసుకొని రావాలన్న ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డవాగుపై వంతెన నిర్మించకపోవడంతో 15 ఏళ్ల నుంచి రైతులు అవస్థలు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ అడ్డువాగుపై వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె హామీ మేరకు పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. అయితే పనులకు నోచుకోలేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో వాగు దాటేందుకు రైతులు, కూలీలు నరకయాతన పడుతున్నారు. కొద్దిపాటి వరద వచ్చిన వాగు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు సాగు భూములకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. వరద తగ్గే వరకు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఆళ్లగడ్డకు మళ్లీ భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వంతెన నిర్మాణ పనులు చేపడతారని రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయండి

- కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర - నంద్యాల : ఈనెల 17 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకొని విజయవంతం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం, పిజిఆర్ఎస్, డివార్మింగ్ డే తదితర అజెండా అంశాలపై ఆర్డీవోలు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 15 రోజులపాటు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగస్తులను పెద్ద ఎత్తున భాగస్వామ్యులయ్యేలా చూడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులచే దేవాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పర్యాటక ప్రదే శాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో పారిశుద్ధ్య కార్య క్రమాలు ముమ్మరంగా చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్ధ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా 74 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆరోగ్య బీమా కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో డయేరియా కేసులు నమోదు కాకుండా ఎప్పటికప్పుడు ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు శుభ్రం చేయాలని సూచించారు.

సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు

విశాలాంధ్ర. నందికొట్కూరు : కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురామమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక జై కిసాన్ పార్క్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు. సిపిఐ ఉభయ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రఘురామ్మూర్తి, జనసేన పార్టీ జిల్లా నాయకులు రామిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు డా.రాజుల ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ గోపాలకృష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాల కొరకు పనిచేద్దామని నినాదాలు చేశారు . లౌకికవాదం, సామాజిక ప్రజాస్వామ్యం కోసం ఏచూరి నిరంతరం పోరాడారన్నారు. కార్యక్రమంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు వినోద్, శేఖర్‌నాయుడు, దిలీప్ రాజు, హర్షవర్ధన్, ప్రజాసంఘాల నాయకులు శ్రీని వాసులు, ఓబులేసు, ఫకీర్ సాహెబ్, ఎం.కర్ణ, ఏఐటీయూసీ నాయకులు రమణయ్య, రామకృష్ణ, అమర్నాథ్, మహిళ సంఘం నాయకురాలు సాజిదాబి, రంగమ్మ, రజతమ్మ, ఈశ్వరమ్మ, జయరాన్ని, ఆకుల రాము, పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

విశాలాంధ్ర-డోన్ : సీపీఎం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారామ ఏచూరి బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు అన్నారు.శుక్రవారం స్థానిక సీపీఐ నక్కి రామన్న భవనంలో వామపక్షాల నేత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ కార్యదర్శి బి.నారాయణ అధ్యక్షతన వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం బాధాకరమని లెఫ్ట్ ప్రజాస్వామ్య ఉద్యమానికి తీరనిలోటు అని ఆవేద వ్యక్తం చేశారు. వామపక్షాల ఐక్యతకు బలోపేతానికి కృషి చేశారని రాజ్యసభ సభ్యుడిగా సభలో అనేక అంశాలు లేవనెత్తడమే కాక యూపీఏ ప్రభుత్వానికి ప్రపంచీకరణ సరళీకరణకు సంబంధించి సలహాలు సూచనలు చేసి ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి తన వంతుగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు వరదరాజులు, హుస్సేన్ పీరా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్తు యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాపు, మండల కార్యదర్శి రంగస్వామి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, మహిళా సమైక్య మహిళా సమైక్య సీనియర్ నాయకురాలు నక్కీ బాలమ్మ, జిల్లా ఆర్గనైజ్ కార్యదర్శి షమీం బేగం, సీపీఐ ప్యాపిలి మండల కార్యదర్శి పి.వెంకటేశు, ఏఐవైఎఫ్ నాయకులు విజయుడు, రాఘవేంద్ర, పృధ్వి కుమార్, దివాకర్,సిద్దు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గొంతుక సీతారాం ఏచూరి

విశాలాంధ్ర-అవుకు : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి చాలా బాధాకరమని ఏఐటీయూసీ నాయకులు నాగాంజనేయులు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆగస్టు 19వ తేదీన ఊపిరితిత్తుల సమస్యలతో ఢిల్లీలో వైద్యం కోసం నిమ్స్ హాస్పిటల్లో చేరారని అన్నారు. వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయన మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా సభలో అనేక అంశాలను లేవనెత్తి ప్రజా గళాన్ని వినిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల ఉసేని, వెంకటేశ్వర్లు, రమేష్, నవ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడిగా ఎనలేని సేవలు

విశాలాంధ్ర, బనగానపల్లె: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధాకరమని ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శివ బాలకృష్ణ మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలతో ఢిల్లీలో నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారని తెలిపారు .రాజ్యసభ సభ్యుడిగా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా రైతుల పక్షాన, కార్మికుల పక్షాన రాజీ లేని పోరాటాలు చేశారని, ఆయన మరణం సీపీఎం పార్టీకి తీరని లోటుని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు కుళాయిస్వామి, నాగాంజనేయులు, బాల సంజీవులు పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే..

- హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర-నంద్యాల .. నంద్యాల ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే సందర్భంగా ప్రిన్సిపల్ కరిముల్లా ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, డిఐఈఓ సునీత, ఉర్దూ కళాశాల ఇన్స్పెక్టర్ అస్మద్దీన్, టిడిపి నంద్యాల పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, సోమ శేఖరప్ప, కందుకూరి శ్రీరామమూర్తి, కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్, బాలచంద్రుడు, అంజద్ భాషా సిద్ధికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, బాలికలు అన్ని రంగాలలో రాణించాలంటే చదువు ముఖ్యమని, బాగా చదువుకొని కాలేజీకి, తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అలాగే గతంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో విద్యార్థులు తక్కువగా ఉన్న సమయంలో కరిముల్లా ప్రిన్సిపల్ అయిన తర్వాత 120 మంది విద్యార్థినులను చేర్పించామనిచ ఇది అందరి సమిష్టి కృషి అని, రానున్న రోజుల్లో ఉర్దూ జూనియర్ కాలేజీకి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నియమాలతో ప్రమాదాలు అరికట్టండి

విశాలాంధ్ర-చాగలమర్రి : ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు పాటించి ప్రమాదాల .నివారణకు కృషి చేయాలని టోల్ ప్లాజా అధికారులు ఖాదర్ వలి, పరదీప్ మాలిక్, ఖుతుబుద్దీన్ భాషలు అన్నారు. శుక్రవారం చాగలమర్రిలోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాలనందు, రాయలసీమ ఎక్స్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌లో ఇంటరైజ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో రహదారి భద్రత, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. పారామెడికల్ వైద్యాధికారి అబ్దుల్ కలాం పిల్లలకు అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సిపిఆర్ ఎలా చేయాలో వివరించారు. చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షబ్బీర్ అహమ్మద్, వైస్ ప్రిన్సిపాల్ గౌస్ లాజమ్, ఉపాధ్యాయులు నాయబ్ రసూల్, మహబూబ్ సాహబ్, సతీష్ కుమార్ పాల్గొన్నారు .

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలో అతిసారతో ముగ్గురు మరణించడం, పలువురు అతిసార బారినపడిన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పివిఎస్ఎస్ మూర్తిలు ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో పర్యటించారు. అభ్యుదయ కాలనీ, దొమ్మరకాలనీ, సద్దాం కాలనీ, చాంద్ వీధిలలో అధికారులు పర్యటించారు. కాలనీవాసులతో వారు మాట్లాడారు. కాచి చల్లార్చి వడగట్టిన నీటినీ మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని, బయట తినుబండారాలను తినరాదని సూచించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఏఈ సురేంద్ర రెడ్డి, వీఆర్వో పరమేశ్వర్ రెడ్డి, ముస్లిం నాయకులు షేక్ ఆజాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి



విశాలాంధ్ర- కోవెలకుంట్ల: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయం సమీపంలోని బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం సంఘటన చోటు చేసుకుంది. కోవెలకుంట్ల పరిధిలోని ఆమదాల గ్రామానికి చెందిన గుర్రప్ప (45) సంవత్సరాలు రోజువారి కూలి పని చేసుకునేవాడు. శుక్రవారం పాండురంగ స్వామి టెంపుల్ దగ్గర పూల మొక్కల గుంతలు తీయడానికి వచ్చి పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బనగానపల్లె నుండి కోవెలకుంట్ల కు వస్తున్న ఆర్టీసీ బస్సు పాండురంగ స్వామి గుడి సమీపంలోని బనగానపల్లె సర్కిల్ దగ్గర ఢీకొనగా అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృత్యుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అలుగు వాగు దాటుతూ రెండు ఎద్దులు మృతి..

ప్రాణాలతో బయటపడ్డ రైతు

విశాలాంధ్ర-వెలుగోడు: వెలుగోడు గ్రామానికి చెందిన కురువ వెంకటరమణ బాడుగ కొరకు బోయరేవుల గ్రామానికి ఎద్దుల బండిపై వ్యవసాయ పని ముట్లతో వెళ్ళాడు. పని ముగించు కొని తిరిగి ఇంటికి వెళ్దామని బోయ రేవుల గ్రామం శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగు వాగు దాటు తూ వాగు దాటుతుండగా ఎద్దుల బండి తిరగబడింది. ఈ ఘటనలో రెండు ఎద్దులు మృతి చెందాయి. రైతు వెంకటరమణ వాగులో మునిగి పోతుండగా చుట్టుపక్కల రైతులు వచ్చి కాపాడారు. ఎద్దుల విలువ సుమారు రూ.1,50,000లు ఉంటాయని బాధితుడు రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి..

విశాలాంధ్ర-నంద్యాల .. జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఆప్కాస్ ఉద్యోగస్తులకు 15 నుండి 20 నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధితుల తరుపున నాగరాముడు మాట్లాడుతూ జిఓ నెంబర్ 188 నోటిఫికేషన్ ద్వారా 15 నెలల క్రితం ఆప్కాస్ ఉద్యోగులు డ్యూటీలో చేరారని, ఇన్ని నెలలుగా వీరితో పని చేయించుకుంటూ జీతాలు ఇవ్వకపోవడం దుర్మారమైన విషయం అన్నారు. ఇంతటి దారుణమైన పరిస్థితులు కల్పించడానికి కారణం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారా లేక డిసిహెచ్ఎస్ నా, లేక సూపరింటెండెంట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాలా లేక వీరికి ఉద్యోగాలిచ్చింది ప్రభుత్వమా అంటూ నిలదీశారు. కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



విశాలాంధ్ర-పాములపాడు : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బానకచెర్ల వేంపెంట రోడ్డుపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన ఆదాం (45) బానకచర్ల వైపు నుండి మోతుకూరు గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా వేంపెంట, బానకచర్ల గ్రామాల మధ్యన సుబ్బారెడ్డి పొలం సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. వేంపేట గ్రామానికి చెందిన స్థానికులు డ్రైవర్‌కు నీళ్ల తాపి 108కి ఫోన్ చేశారు, కొద్ది క్షణాల్లోనే అతను మరణించాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్‌ను బలోపేతం చేస్తాం

విశాలాంధ్ర - నంద్యాల : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్‌లో సభ్యులను నూతనంగా చేర్చుకున్నామని స్టేట్ జనరల్ సెక్రెటరీ దాల్మిల్ అమీర్, రాయలసీమ జోన్ ఇంచార్జ్ ఫయాజ్ లు పేర్కొన్నారు. ఇబ్రహీం, ప్రేమరాజ్, రాజేష్, చిరంజీవి, జయంత్, లక్ష్మీనారాయణ, మహమ్మద్ హుస్సేన్, హరినాథ్, సుభాన్, మహమ్మద్ రఫీలకు నంద్యాల పద్మావతి నగర్ లోని రాయలసీమ జోన్ ఆఫీస్ నందు ఐడి కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పద్మావతి, తౌసిఫ్, సత్యం సింగ్, ఖాసీం వలి, షరీఫ్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈమెయిల్ పంపిన ముస్లింలకు ధన్యవాదాలు

నంద్యాల ముస్లిం జేఏసీ

విశాలాంధ్ర-నంద్యాల వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించడానికి ఆఖరి రోజు కావడంతో నంద్యాల అసెంబ్లీ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సాధిక్ నగర్ మసీదులో జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ-మెయిల్స్ పంపించే కార్యక్రమం చేపట్టామని జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్ కరీం, కో కన్వీనర్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. గన్ని అబ్దుల్ కరీం మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు సవరణ జరిగితే రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని ఈ బిల్లు అమలు జరిగితే ముస్లిమేతరులు వక్ఫ్ ఆస్తులపై పెత్తనం చలాయిస్తారని వక్ఫ్ బోర్డుకున్న అధికారాలను ప్రభుత్వం లాక్కుంటుందని మసీదులు, మదర్సాలు, ఖబరస్తాన్లు పీర్లచావిడీలు, దర్గాలు ఆస్థానాలు ఇతర వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకున్న వక్ఫ్ ట్రిబ్యునల్ తన అస్తిత్వాన్ని కోల్పోనుందని, ఈ బిల్లుకు వ్యతిరేకంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ-మెయిల్ పంపిన ముస్లిం సోదర సోదరిమణులందరికి జేఏసీ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కార్యవర్గ సభ్యులు సుహైల్ రానా, రెహేమాన్, కార్యవర్గ సభ్యులు మాస్టర్ సర్దార్ ఖాన్, జుబేర్ పుణ, సాధిక్ నగర్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వెలుగోడు : సామాజిక ప్రజాస్వామ్య పార్టీ (ఎస్ డి పి ఐ) ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా గురువారం రాత్రి వెలుగోడు పట్టణంలోని మదీనా సెంటర్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డిపిఐ శ్రీశైలం అసెంబ్లీ అధ్యక్షులు హుస్సేన్ బాష, ఎస్‌డిపిఐ శ్రీశైలం అసెంబ్లీ కమిటీ మెంబర్ ఆరిఫ్ హుస్సేన్, వైసీపీ టౌన్ ప్రెసిడెంట్ ఇలియాస్ ఖాన్,తోయ్యిబ్ మౌలానా,హాఫిజ్ గాఫూర్,అవాజ్ కమిటి ప్రెసిడెంట్ రఫీలు మాట్లాడుతూ ఈ చట్టం తేవడానికి కారణం కేవలం వక్ఫ్ బోర్డు, భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి మాత్రమే అన్నారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం పెద్దలు దానంగా ఇచ్చియుండి, వాటి బాగోగులు చూసుకోవాడానికి ముస్లిం మత పెద్దలకు అప్పజెప్పి, అవి అన్యాక్రాంతం కాకుండా చేశారున్నారు. కాని ఈ భూములు ప్రభుత్వాన్ని సంబంధించినవి కావన్నారు.

గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోండి ..

సిపిఐ నాయకులు రమేష్ బాబు



విశాలాంధ్ర, జూపాడు బంగ్లా: మండలంలోని ఉన్న అన్ని గ్రామాల్లో గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం కాకుండా గ్రామం చుట్టూ బౌండరిలు ఏర్పాటు చేసి సెంటు భూమి కూడా అన్యాకాంతం కాకుండా గ్రామ ప్రజలకు చెందేలా చర్యలు తీసుకోవా లని, ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు పంచాలని సిపిఐ జిల్లా నాయకుడు ఏం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూపాడుబంగ్లాలోని సిపిఐ పార్టీ కార్యాలయం లో ఆయన మాట్లాడారు. భాస్కరపురం గ్రామంలోని శ్రీశైలం నీటి మునకలో అనేక ఎకరాలు భూములు కోల్పోయిన బాధితులందరికీ ఇళ్ల స్థలాలు ప్రతి కుటుంబానికి ఐదు సెంట్లు ఇవ్వడం జరిగిందని దాదాపు 100 ఎకరాలలో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే ఇప్పుడు 100 ఎకరాలు కాకుండా అనేక ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని భూ కబ్జాదారులు అక్రమంగా పట్టాలు చేయించుకుని ఆక్రమించుకున్నారని తక్షణమే ఆ భూములపై న్యాయ విచారణ చేసి ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. జూపాడుబంగ్లా మండల రెవెన్యూ అధికారులు, నందికొట్కూరు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టికి కేంద్రికరించి అన్యాక్రాంతమైన భూములను పరిరక్షించాలని న్యాయ విచారణ చేసి గ్రామస్తులకు అప్పగించాలని కోరారు. మండలంలోని అనేక గ్రామాల్లో గ్రామ కంఠం భూములు భూ స్వామ్య పెత్తందర్ల చేతుల్లో అన్యాక్రాంతం అయ్యాయని వాటి పరిరక్షణ కు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.. అనేక సంవత్సరాల నుండి భూ సమస్యలపై పోరాటం చేస్తున్న అధికారులు స్పందించడం లేదన్నారు. రోజు వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనేక గ్రామాల్లో భూ ఆక్రమణ జరిగిన స్థలలపై ప్రత్యక్షంగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. సంబంధిత తహసిల్దార్ నిర్లక్ష్యం చేయకుండా అక్రమంగా భూముల ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాబరి కేసులో నిందితుడి అరెస్టు

-రూ.2 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు రికవరీ

విశాలాంధ్ర బనగానపల్లె :ఈ నెల 6వ తేదీన పట్టణంలో జరిగిన రాబడి కేసును ఛేదించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో టౌన్ సిఐ కృష్ణ యాదవ్ కేసు వివరాలు వెల్లడించారు. 6వ తేదీన ఉదయం 6 గంటల సమయంలో బనగానపల్లె పట్టణంలోని సప్తగిరి లాడ్జి పక్కన గదిలో ఒంటరిగా నివాసం ఉంటున్న ఎర్ర గొల్ల పార్వతమ్మ (62) మహిళను కొట్టి బంగారు చైను ఒక జత కమ్మలు (సుమారు రెండు లక్షలు) బలవంతంగా గుంజుకొని మోటార్ సైకిల్‌పై ఓ వ్యక్తి పారిపోయాడు. ఈ మేరకు రాబడి కేసు నమోదు చేసి టెక్నాలజీని ఉపయోగించుకొని పోలీసు బృందం విచారణ చేపట్టారు. శుక్రవారం అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన లేట్ ముత్తయ్య కుమారుడు బందెల దానమయ్య బంగారు గొలుసు అమ్ముదామని బనగానపల్లె శివారులోని రాఘవేంద్ర రైస్ మిల్ వద్ద ఉండగా బనగానపల్లె టౌన్ సిఐ కృష్ణయ్య యాదవ్ వారి బృందం ద్వారా కనిపెట్టబడిన నిందితుడి వద్ద నుండి పంచాయతీ దారుల సమక్షంలో ఒక బంగారు చైను ?1000 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. బంగారు కమ్మలు ఖర్చుల నిమిత్తం అమ్ముకున్నట్లు తెలిపారు.ఈ మేరకు బంగారు ఆభరణాలు రికవరీకి కృషిచేసిన పీసీలు సుబ్బరామకృష్ణ, ప్రదీప్, ప్రసాద్, నాగన్న, రివార్డులు అందజేశారు. ఎస్సై వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు లక్ష విరాళం

విరాళం అందించిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-వెలుగోడు : వెలుగోడు మండలంలోని ఉపాధ్యాయులు విజయవాడ వరద బాధితులకు విరాళం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు శేషి రెడ్డికి స్కూల్ ఏద్యుకేషన్ తరుపున మండల విద్యాధికారి బ్రహ్మం నాయక్ రూ.1,45,000లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పిలుపు నందుకుని ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. అలాగే టిడిపి సోషియల్ మీడియా కోఆర్డినేటర్ షెక్ హుశేన్ సాహెబ్, మిత్రుల సహకారంతో విరాళాలు సేకరించి రూ.14,410లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, కృష్ణార్జునరెడ్డి, రవి, లిటిల్ ఎంజల్స్ స్కూల్ కరస్పండెంట్ ఇమ్మనియేలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 14, సెప్టెంబర్ 2024

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-కర్నూలు : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుసంఘం నాయకులు సురేంద్ర యాదవ్ అధ్యక్షతన కర్నూలు మండలం నూతనపల్లెగ్రామ రైతుసంఘం నూతనకమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నకిలీ ఎరువులు,నకిలీ విత్తనాలు'నకిలీ క్రిమిసంహారక మందుల వల్ల రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారన్నారు. జిల్లాలోని 106 చెరువులకు నీళ్ల నింపాలని..జిల్లాలోని పంట పొలాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారిపైన కేసుల నమోదు చేయాలన్నారు.

నూతనపల్లె గ్రామ కమిటీ ఎన్నిక

గ్రామశాఖ అధ్యక్షులుగా నజీర్‌మియా, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, నాగశేషులు, గ్రామశాఖ కార్యదర్శిగా శేఖర్, సహాయ కార్యదర్శిగా బాలస్వామి, ఖాజా, కోశాధికారిగా రాములను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజునాయక్, చంద్రకళ, దాసు, స్వాములు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి-ఏపీ రైతుసంఘం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం..పంటల భీమా ఇవ్వాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ కోరారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ మాట్లాడుతూ ఈ ఏడాది జూన్,జూలైలో కొద్దిపాటి వర్షంతో రైతులు కొర్ర, సజ్జ, కంది, మినుములు, ఆముదం, వేరుశనగ, పత్తి, మిరప,ఉల్లి తదితర పంటలు వేసుకున్నారని 40 రోజులు వర్షం రాని కారణంగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆగస్టులో ఎడతెరిపి లేకుండా తుఫానులు,అధిక వర్షాలతోపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు.ఈనెల 10న కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం,ఆదోని, పత్తికొండ,ఆలూరు, దేవనకొండ,ఆస్పరి మండలాల్లో రైతు సంఘ బృందం పంటల పరిశీలన చేపట్టిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. కర్నూలు జిల్లా అంతట అధిక వర్షాల వల్ల రైతులు వేసుకున్న పంటలు కొర్ర, సజ్జ, వేరుశనగ, ఆముదం, ఉల్లి, టమోట, పత్తి, మిరప, తదితర పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు రైతు సంఘం బృందానికి తెలిపారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం రెవెన్యూ, అగ్రికల్చరర్ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలన జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని వారు కోరారు. నష్టపోయిన పంటలకు కొర్ర సజ్జ,కంది, వేరుశనగ,ఆముదం, మినుములు తదితర పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున,ఉల్లి,మిరప, పత్తి, ఉద్యానవన పంటలకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరారు.అదేవిధంగా రైతులు వేసుకున్న పంటలన్నిటికీ పంటల భీమా వర్తింపచేయాలన్నారు.. రైతులు ఖరీఫ్ లో ఈ సంవత్సరం తీసుకున్న పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని వారు కోరారు. అదేవిధంగా రైతులు రబీలో సాగు చేయనున్న పంటలకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉచితంగా ఇవ్వాలని వారు తెలిపారు.

హంద్రీనీవా కాల్వ కింద లోతట్టు ప్రాంతాల్లో రైతుల వేసుకున్న పంటలు పూర్తిగా నీట మునిగి పంటలు దెబ్బతిన్నాయి. వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజా సాబ్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు సురేంద్ర యాదవ్, మల్లికార్జున యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-పత్తికొండ: నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ నియోజకవర్గ కేంద్రంలో బాలికల వసతిగృహం లేకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల విద్యార్థినులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం, పాఠశాల విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయాలన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్, నాయకులు రోషన్, ఇర్ఫాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో కమ్యూనిటీ హాలు నిర్మించాలి

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటా రనీ, అలాగే వివాహ సీజన్‌లో వివాహ కార్యక్రమాలు జరుగుతుంటాయని అయితే సరైన వసతులు లేక భక్తులు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కురువ సంఘం నాయకులు ఎల్లార్తి దర్గప్ప డిమాండ్ చేశారు. హైదరాబాదులో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు ఇవ్వాలని కోరగా అందుకు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సమ్మతి తెలిపారన్నారు. దేవరగట్టు అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య నిధులిస్తే ఎంతో బాగుంటుందని విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణ ఎన్నో కలిసిన వారిలో పూర్వ సంఘం నాయకులు సోమప్ప, ఎండిహళ్లి సుధాకర్ తదితరులున్నారు.

పంట దిగుబడులు సాధించాం...అమ్ముకోవడం ఎలా..!

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : పంట దిగుబడులుసాధించాం...అమ్ముకోవడం ఎలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి పంట పండించిన రైతులకు వరుస వర్షాలు ఎక్కువై పంట చేతికి రాక ఉన్న పంటను అమ్ముకోవడానికి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో దింపుకుంటే వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి ఉల్లి రైతులను ముంచేస్తున్నారు. పండిన పంట వర్షాలతో తడిసి కష్టాల్లో ఉన్న రైతులపై వ్యాపారులు కనీస కనికరం చూపడం లేదని ఆవేదాన్ని వ్యక్తం చేస్తున్నారు. బస్తిపాడుకు చెందిన ఎల్లయ్య అనే రైతు 65 సంచులు ఉల్లిగడ్డలు తెస్తే అందులో 6 సంచుల ఉల్లిగడ్డలు చెల్లవని చెప్పడంతో వాటిని పారబోయించారనీ కన్నీటి పర్యంతమయ్యారు.ఉల్లిగడ్డలకు డిమాండ్ ఉన్నప్పటికీ..ఇక్కడ మాత్రం ధర నేల చూపు చూడవేసిందే అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉల్లి రైతులను కళ్లెదుట వ్యాపారులు మోసం చేస్తున్న అధికారులు పట్టించుకోక పోవడం కడు శోచనీయన్నారు.

సిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కలెక్టరేట్ ఆవరణలోని పాత్రికేయ గణపతికి ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఎమ్మెల్యే గౌరుచరిత,ఎస్పీ బిందు మధవ్‌లు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. వినాయక చవితి నాటి నుండి నిత్యం ఉదయం,సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం అల్పాహారం భక్తులకు అందచేస్తున్నారు. సిద్ధి వినాయకుని ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే, ఎస్పీలు ప్రత్యేక పూజలు నిర్వహించి, డీపీఆర్వో కార్యాలయం ఆవరణలో చెట్లు నాటారు. కార్యక్రమంలో మంజూనాథ్, శ్రీనాథ్, సాగర్, మధు, సీనియర్ ఫోటోగ్రాఫర్ అంజి, రామాంజనేయులు, చంద్రశేఖర్, చిరంజీవి, నాగేంద్ర ప్రసాద్, మల్లిఖార్జున తదితరులున్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగర గణేశులకు ఘనవీడ్కోలు పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని మేయర్ బి.ఎల్లా రామయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వినాయక ఘాట్‌ను మేయర్, వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరం తర్వాత అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగలు జరుపుకుంటూ, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే నగరం కర్నూలు అన్నారు. వినాయకచవితి పండుగ అనంతరం 9 రోజులకు నిమజ్జనం నిర్వహించడం నగరంలో ఆనవాయితీ అని, ఆదివారం నగర గణేశుల నిమజ్జనానికి ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, రూ.40 లక్షలతో అన్ని సౌకర్యాలు, ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లలో నీటి సరఫరా, సిసి కెమెరాలు, రహదారుల్లో విద్యుత్ దీపాలు, మైకులు, షామియానాలు, కంట్రోల్ రూమ్‌లు వంటివి ఏర్పాటు చేశామని, ఇక గణేశుల నిమజ్జనం కోసం 6 ఘాట్‌లకు 6 క్రేన్‌లు, అదనంగా మరో 2 క్రేన్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. నీళ్ళలో ఏదైనా ప్రమాదం సంభవించినా ముందుజాగ్రత్తగా గజ ఈతగాళ్లు కూడా అందుబాటులో ఉంటారన్నారు. 370 మంది నగరపాలక సిబ్బంది నిమజ్జనం పూర్తి అయ్యేంత వరకు విధులు నిర్వహిస్తారన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, విక్రసింహా రెడ్డి, యూనూస్‌బాష, జుబేర్, సంగాల సుదర్శన్ రెడ్డి, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వర రెడ్డి, ఏసిపి రంగస్వామి, డిఈఈ నరేష్, ఏఈలు జనార్ధన్, భాను పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని నేరనికితండాలో మృతి చెందిన కృష్ణానాయక్ మృతదేహాన్ని ఎమ్మెల్యే విరుపాక్షి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కృష్ణా నాయక్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందించే ఆర్థిక సహాయం కోసం ప్రయత్నిస్తామని మృతుడి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.కార్యక్రమంలో రామునాయక్, మంజునాయక్, గుండా నాయక్, ఎస్కే గిరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ గోడపత్రిక విడుదల

విశాలాంధ్ర-కల్లూరు: జాతీయ నులిపురుగుల నివారణ గోడ పత్రిక ఎంపీడీవో కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్స్, ఎంపీడీవో, ఎంఈఓ అధ్యక్షతన విడుదల చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 17న ప్రతి పాఠశాలలో, గ్రామంలో ఆల్బెండజోల్ మాత్ర ప్రతివిద్యార్థికి వేమాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోఆర్డీ కిషోర్, కల్లూరు, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల చేయూత అందించిన యువత

విశాలాంధ్ర-హొళగుంద : చిన్నహ్యాట యువకులు మేముసైతమంటూ ముందు కొచ్చి గ్రామ పెద్దలతో కలసి శుక్రవారం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాల్లో భాగంగా రూ.7,110 నగదు, 8 బస్తాల బియ్యం, హొళగుంద వరద బాధితుల సహాయ సమాఖ్య కమిటీ సభ్యులకు గ్రామ పెద్దలు రాజా పంపన గౌడ్, చిన్నహ్యాట శేషగిరి కమిటీ సభ్యులకు నగదు బియ్యం అందజేశారు.విజయవాడ వరద బాధితులకు నగదు బియ్యం రూపంలో చిన్నహ్యాటలో తమకు తోచిన సాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా గ్రామ పెద్దలు యువకులు కృతజ్ఞతలు తెలిపారు.యువకులు కె.బసవరాజ్, వడ్డే అమ్రేష్, చాకలి ఎల్లప్ప, కురువ మంజు, సి.హెచ్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఇండి గ్యాపు పొలంబడి సర్టిఫికేషన్ శిక్షణ

విశాలాంధ్ర-జిల్లా పరిషత్ : ఉమ్మడి జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు,మండల వ్యవసాయ అధికారులకు ఇండిగ్యాప్ పొలంబడి సర్టిఫికేషన్‌పై శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఉద్యానభవన్, కర్నూలులో నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి పి.ఎల్.వరలక్ష్మి,కమిషనరేట్ కార్యాలయం నుండి ప్రతాపరెడ్డి హాజరై ఒక రోజు శిక్షణలో భాగంగా ఇండికా పొలంబడి సర్టిఫికేషన్‌పై దృశ్య రూపంలో శిక్షణ ఇచ్చారు.

కర్నూలులోనూ శ్రీకృష్ణ జువెలరీ షోరూం ఏర్పాటు చేయండి

శ్రీకృష్ణ జువెలర్స్ సేల్స్ అండ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఎంపి నాగరాజు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : కర్నూలులోనూ శ్రీకృష్ణ జువెలర్స్ ఏర్పాటు చేయాలని బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ జె.వి.రావును ఎంపి బస్తిపాటి నాగరాజు కోరారు.స్థానిక మౌర్య ఇన్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జువెలరీ సేల్స్ అండ్ ఎగ్జిబిషన్‌ను ఎంపీ నాగరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు నగరం శర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిని పారిశ్రామికవాడ ఓర్వకల్లుకు అనుసంధానం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుందన్నారు.దీంతో కర్నూలు నగరం మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. లేటెస్ట్ డిజైన్‌తో అదిరిపోయే కలెక్షన్లతో శ్రీకృష్ణ జువెలర్స్‌లో బంగారు, వజ్రాభరణాల అమ్మకాల .. ప్రదర్శన మూడు రోజుల పాటు జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే హైదరాబాదు విశాఖపట్నంలో శ్రీకృష్ణ జ్యువెలర్స్ షోరూమ్స్ ప్రారంభించారని, అక్కడ కస్టమర్ల ఆదరణ బాగా పెరిగిందని, నగరంలో కూడా శ్రీకృష్ణ జూలర్స్ షోరూమ్‌లో ప్రారంభించాలని నిర్వాహకులను ఎంపీ నాగరాజు కోరారు. శ్రీకృష్ణ జ్యువెలర్స్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ జె వి రావు మాట్లాడుతూ హైదరాబాదు బంజారాహిల్స్‌లో శ్రీకృష్ణ జ్యువెలర్స్ షోరూం, ఫ్యాక్టరీ ప్రారంభించి 70 ఏళ్లు పూర్తయిందని, నాటి నుంచి కస్టమర్లు ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. డైమండ్స్, బంగారు ఆభరణాలు అదిరిపోయే కలెక్షన్స్ ఉన్నాయని, ప్రతిఒక్కరూ శ్రీకృష్ణ జ్యువెలర్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఆదరించాలని ఆయన ప్రజలకు సూచించారు. రూ.50 వేలు కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక కానుక ఉంటుందన్నారు. బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ అశ్వక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్భా గాంధీ విద్యాలయం పరిశీలించిన జీసీడీవో

విశాలాంధ్ర-నందవరం : మండల కేంద్రమైన నందవరంలోని కస్తూరి భా గాంధీ విద్యాలయాన్ని జిల్లా జీసీ డీవో మేరీ స్నేహలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆమె విద్యా లయం తనిఖీ అనంతరం మాట్లాడు తూ నీటి సమస్య, మెనూ ప్రకారం మెనూ పాటించడం లేదని ఫిర్యాదు లు అందాయన్నారు.అందులో భాగం గా విద్యాలయాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. తాగునీటికైతే ఎలాంటి సమస్య లేదని, రోజు వారుగా ఫిల్టర్ నీటిని విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వాడుకోవడానికి పంచా యతీ నుండి సరైన సమయంలో నీటిని సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దానిపై కూడా పంచాయతీ అధికారులతో మాట్లాడడం జరిగిందని, అలాగే ఆర్వో ప్లాంట్‌కు జడ్పీహెచ్ స్కూల్ నుండి నీటి సరఫరా లేదని.. సమస్యను జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి నీటిని సరఫరా చేయి స్తామన్నారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని, మెనూలో ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలపై పూర్తి వివరణ కోరడం జరిగిందని, ఆవివరణ ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు హిందీ దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర-ఆదోని: మండల పరిధిలోని పెద్ద తుంబలం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలను జరుపుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, హిందీ ఉపాధ్యాయురాలు నయన కుమారి తెలిపారు. హిందీ దినోత్సవ సందర్భంగా హైస్కూల్లో విద్యార్థులు స్వచ్ఛ భారత్ పాటలు, డాన్సులు, నాటికల ద్వారా హిందీ యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. అదేవిధంగా ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా రాష్ట్రంలో పదవ తరగతి 2024 ఎగ్జామ్స్ హిందీలో జడ్పీ హైస్కూల్, పెద్దతుంబలం విద్యార్థి ఎస్.ఎండి. ఫరూక్ 100/99 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి టాపర్ గా నిలవడంతో హిందీ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థికి హెడ్మాస్టర్ వెంకటేష్ చేతుల మీదుగా మెమొంటో,అభినందిస్తూ దృవీకరణ పత్రం హిందీ ఉపాధ్యాయురాలు డి.నయన కుమారి అందజేశారు. హిందీలో టాపర్స్ అయిన విద్యార్థులకు మెమెంటోస్..సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభాష అయిన హిందీ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, హిందీ యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు తెలిపారు. రెండో శనివారం కావడంతో ముందుస్తు హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవడం జరిగిందని వారు తెలిపారు.

వెలగని విద్యుత్ దీపాలు..అంధకారంలో గ్రామాలు

విశాలాంధ్ర-కల్లూరు: కొన్ని నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లో వెలిగే ఎల్ఈడి వీధిలైట్లు పనిచేయకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అంధకారంలో కొట్టుమిట్టాడుతూ ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బస్తిపాడు, చిన్నటేకూరు, బొల్లవరం, పర్ల, ఉలిందకొండ, చెట్లమల్లాపురం, కొంగనపాడు, ఎర్రకత్వ, పందిపాడు, లక్ష్మీపురంలతో పాటు పలు గ్రామాల్లో గతంలో వేసిన ఎల్ఈడీ లైట్లు కాలిపోయి రాత్రి ప్రజలు తిరుగలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ఈ విషయంపై ప్రజలు పలుమార్లు సంబంధిత పంచాయతీ సెక్రెటరీలకు విన్నవించినప్పటికీ పెడచెవిన పెడుతున్నారనీ మండి పడుతున్నారు. ఇప్పటికైనా పనిచేయని వీదిలైట్లను పునరుద్ధరించి పనిచేసేలా చూడా లని ఆయా గ్రామాల్లోని ప్రజలు వేడుకుంటున్నారు.

మేము సైతం వరద బాధితుల సేవలో..

విశాలాంధ్ర-కౌతాళం రూరల్: వరద బాధితుల సేవలో మేముసైతం పాలు పంచుకుంటామని ఆటో డ్రైవర్లు ముందుకు వచ్చారు. శుక్రవారం ఆటో డ్రైవర్లు అందరూ చర్చించుకుని తమ వంతు సహాయంగా ఆర్థికసాయం అందజేశారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజుతో కలిసి తమవంతుగా ఆర్థిక సహాయాన్ని ఆర్థిక సాయాన్ని నగదు రూపంలో ముట్ట చెప్పారు. సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ వరద ముంపుతో విజయవాడ అతలా కుతలమైందన్నారు. ఇళ్లలో మూడు అడుగుల మేర వరద నీరు చేరడంతో నిత్యవసర సరుకులు,బట్టలు, తిండి గింజలు మొత్తం నీటిలో మునిగిపోవడంతో ప్రజలు ఆకలితో వస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగిపోవడంతో నష్టం ఏర్పడిందని బాధను వ్యక్తం చేశారు.

సాటి మనిషిగా ఆపదలో ఉన్న వారిని తమవంతుగా ఆదుకోవాలన్న సదుద్దేశంతో ముందుకు రావడం జరిగిందని వారు వివరించారు.

నాణ్యత ప్రమాణాలకు మారుపేరు అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్

విశాలాంధ్ర-బళ్లారి చౌరస్తా : నాణ్యత ప్రమాణాలకు మారు పేరుగా గుర్తింపు పొందిన ఏకైక సంస్థ అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్ అని నిర్వాహకులు శ్రీనివాస వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు-ఎమ్మిగనూరు రహదారిలో అత్యాధునిక హంగులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సన్‌ప్యూర్ మ్యాన్ ఫ్యాక్చర్ హార్దిక్ పటేల్, కంపెనీ ప్రతినిధి సునీల్, భాగస్వామి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోనే అతిపెద్ద ఎంటర్‌ప్రైజెస్ అయిన అయ్యప్ప ఒకటన్నారు. తమ సంస్థ గుజరాతి తయారీ ఉత్పతులతో పాటు ప్రీమియం క్వాలిటీ ప్రత్యేక మన్నారు. రూ లక్ష విలువైన సామాగ్రి కొనుగోలు చేసిన వారికి ఉచితంగా వాహన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. బిల్డర్స్, కన్స్ట్రక్షన్ రంగం వారు సైతం అధిక మొత్తంలో సామాగ్రి కొనుగోలు చేస్తే ఇక్కడ నుండి రాష్ట్రంలో ఎక్కడికైనా ట్రక్కు సదుపాయం కల్పిస్తామన్నారు. తమ వద్ద బయటి వారి కంటే 10 నుండి 15 శాతం తగ్గింపు ధర సౌకర్యం ఉందన్నారు. అందమైన నిర్మాణాలకు అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్ తోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

సీఎం సహాయనిధికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: సీఎం సహాయనిధికి రూ.5 వేలు, 100 చీరలు, 50 కేజీల బియ్యం స్థానిక నాగపులకట్ట వీధిలోని ప్రగతి డిఎస్సి కోచింగ్ సెంటర్ తరపున వరద బాధితులకు సహాయార్థం రూ.5 వేలు చెక్కును సీఎం సాయినిధికి పంపినట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రంగస్వామి, ప్రగతి డిఎస్సి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ నాగేశ్వరావు తెలిపారు.

PASSPORT MISSING

I, GOLLA URUKUNDU, S/o. GOLLA GOVINDU, R/o. H.No: 1-23, BC Colony, Salakalakonda (V), Adoni(M), Kurnool dist., AP., have lost my Original Indian passport bearing No: S4914942, which was kept in the plastic Cover Bag after completed of Xerox, and same Bag has been lost or missing While I was going to my house at Salakalakonda if anyone found please inform to the above address.

Cont: 90521 43553

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ మార్గ్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. ఇండియా.
బ్రాంచ్ చిరునామా: డోర్ నం-7-106, 7-107, 3వ అంతస్తు, శ్రీనగర్ కాలనీ, కర్నూలు రోడ్డుకు దక్షిణం సందు, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్-523 002

ప్రైవేటు ఒప్పందం కింద స్థిర ఆస్తి అమ్మకానికి నోటీసు

హామీగా పెట్టిన రుణాలను తిరిగి రాబట్టుట కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("నియమాలు") కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకున్న స్థిర ఆస్తులను ప్రైవేటు ఒప్పందం ద్వారా విక్రయించేందుకు విక్రయ నోటీసు. అయితే దిగువ సంతకందారైన కింద సంతకం చేసిన వ్యక్తి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా సర్ఫేశీ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సెక్షన్ 13(2) నిబంధన 9 కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసు పేర్కొన్నట్లుగా పూర్తి రుణ మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలందరూ నిర్దేశిత గడువులోగా రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి క్రింద పేర్కొన్న స్థిర ఆస్తిని భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది. మరియు పేర్కొన్న హామీగా పెట్టిన స్థిరఆస్తిని నిబంధనలలోని రూల్ 9తో చదివే రూల్ 8(5)లో పేర్కొన్న పద్ధతులను అవలంభించడం ద్వారా విక్రయించడం ప్రారంభించినారు. వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, హామీగా పెట్టిన ఆస్తిని విక్రయించడానికి ఇప్పటికే వేలం నిర్వహించినప్పటికీ విఫలమైనారు. ఇప్పుడు కింద పట్టికలో పేర్కొన్నవిధంగా రిజర్వు ధరకు హామీగా పెట్టిన ఆస్తిని కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న కొనుగోలుదారు(ల) నుండి అధీకృత అధికారి ఆఫర్‌ను అందుకున్నారు. అందుచేత కింద పేర్కొన్న రుణ ఖాతాలోని మొత్తం బకాయిలను ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి పదిహేను (15) రోజులలోపు చెల్లించని యెడల బకాయిలు రాబట్టుకునేందుకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్స్ 8&9తో చదివే సర్ఫేశీ చట్టం యొక్క నిబంధనలకు లోబడి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అనుకూలంగా తనఖా పెట్టబడిన క్రింద పేర్కొన్న హామీగా పెట్టిన ఆస్తి తేదీ: 28-09-2024న "ప్రైవేటు ఒప్పందం" ద్వారా "ఎచ్చట ఉన్నది ఉన్నట్లు" మరియు "ఏముంటే అదే ప్రాతిపదిక" పై "ఎక్కడ ఉందో అలాగే" ప్రాతిపదికపై విక్రయించబడునని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు)కు నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	లోన్ ఎ/సి. నం. & బ్రాంచ్	రుణగ్రహీత(లు), సహ రుణగ్రహీత(లు), చట్టబద్ద వారసు(లు)/న్యాయ ప్రతినిధి/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం & డిమాండ్ నోటీసు తేదీ	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	స్థిర ఆస్తి యొక్క వివరాలు
1	HL000000 0012401	సుబ్రహ్మణ్యం శెట్టి జి (రుణగ్రహీత), శోభారాణి గంగారప్ప (సహ-రుణగ్రహీత), మహేష్‌కుమార్ గంగారప్ప (సహ-రుణగ్రహీత)	13 నవంబరు 19 నాటికి రూ.1474742/- తేదీ: 31 అక్టోబరు 19	రూ.25,50,000/- (ఇరవై ఐదు లక్షల యాభైవేల రూపాయలు మాత్రమే)	రూ.2,50,000/- (రెండు లక్షల యాభైవేల రూపాయలు మాత్రమే)	ఆంధ్రప్రదేశ్-518422, కర్నూలు జిల్లా, ఆత్మకూరు, సాయిబాబా నగర్, సర్వే నం.907లో ప్లాటు, దగ్గరి డోర్ నం. 1-34-9-10-5-1

హామీగా పెట్టిన ఆస్తులను విడిపించుకోవడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా పైన ప్రస్తావించిన రుణగ్రహీతలను కోరడమైనది.

ప్రైవేట్ ఒప్పందం ద్వారా ఆస్తి విక్రయానికి సంబంధించిన నిబంధనలు & షరతులు క్రింది విధంగా ఉన్నాయి:

1. విక్రయం కచ్చితంగా సర్ఫేశీ చట్టం/నిబంధనల్లోని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడును. విక్రయం "ఎచ్చట ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" మరియు "ఏముంటే అది ప్రాతిపదిక" పై ప్రైవేట్ ఒప్పందం ప్రకారం నిర్వహించబడును.
2. కొనుగోలుదారు ఆస్తి కొనుగోలు కోసం ఆఫర్‌ను వీహెచ్ఎఫ్‌సిఎల్ స్వీకరించిన తర్వాతి పని రోజున విక్రయ పరిశీలన ధరావత్తు సొమ్మును డిపాజిట్ చేయాలి. మరియు మిగిలిన మొత్తం ఆ తర్వాత 15 రోజులలోపు చెల్లించవలెను.
3. కొనుగోలుదారు ఆఫర్ చేసిన మొత్తంలో 10% దరఖాస్తుతో పాటుగా జమ చేయాలి. పై క్లాజు (2)ప్రకారం ఇది అప్పటికే చెల్లించిన ధరావత్తు సొమ్ము డిపాజిట్‌తో సర్దుబాటు చేయబడుతుంది.
4. పైన పేర్కొన్న నిబంధన (2) ప్రకారం అవసరమైన మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనట్లయితే దరఖాస్తుతో పాటు చెల్లించిన 10శాతంతో సహా అప్పటికే చెల్లించిన మొత్తం జప్తు చేయబడుతుంది.
5. వీహెచ్ఎఫ్‌సిఎల్ కొనుగోలు ప్రతిపాదనను అంగీకరించనట్లయితే, అప్లికేషన్‌తో పాటు చెల్లించిన 10% మొత్తం ఎటువంటి వడ్డీ లేకుండానే తిరిగి చెల్లించబడుతుంది.
6. వీహెచ్ఎఫ్‌సిఎల్‌కి తెలిసిన లేదా తెలియకపోయినా ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో ఉండే అన్ని భారాలతో ఆస్తి విక్రయించబడుతోంది. థర్డ్-పార్టీ క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలకు అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్ ఏ విధంగానూ బాధ్యత వహించరు.
7. కొనుగోలుదారు ఆస్తి (ప్రైవేట్ ఒడంబడిక ద్వారా జరుగుతున్న విక్రయానికి సంబంధించి) కి సంబంధించిన అన్ని అంశాలపై సంతృప్తి చెందేవిధంగా తగిన శ్రద్ధ వహించాలి.ఈ విషయంలో అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్‌పై తదుపరి తేదీలో ఎలాంటి దావా వేయడానికి కొనుగోలుదారు అర్హులు కారు.
8. ఎటువంటి కారణం చెప్పకుండానే ఏదైనా కొనుగోలు ప్రతిపాదనను తిరస్కరించే హక్కు వీహెచ్ఎఫ్‌సిఎల్ కలిగి ఉంది.
9. ఒకటి కంటే ఎక్కువ ఆఫర్ల విషయంలో, అత్యధిక బిడ్డర్ మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయడంలో విఫలమైతే, వీహెచ్ఎఫ్‌సిఎల్ రెండవ అత్యధిక ఆఫర్‌ను అంగీకరించవచ్చు. 10. ఆసక్తిగల కొనుగోలుదారులు అధీకృత అధికారిని సంప్రదించవచ్చు: నేలపల్లి రాజు రెడ్డి, మొబైల్ నంబర్: 9949600034 సోమవారం నుండి శనివారం వరకు పని గంటలలో (ఉదయం 10 నుండి సాయంత్రం 6 వరకు)
11. కొనుగోలుదారు వర్తించే టీడీఎస్, స్టాంప్ డ్యూటీలు/అదనపు స్టాంప్ డ్యూటీ/ట్రాన్స్‌ఫర్ ఛార్జీలు మొదలైనవాటిని మరియు అన్ని చట్టబద్ధమైన/చట్ట బద్ధం కాని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు మొదలైనవి ఏవైనా భరించవలెను.
12. ఆఫర్ అందుకోవడానికి చివరి తేదీ 27-09-2024 సాయంత్రం 05.00 గంటలలోపు. ఆఫర్‌లను బ్రాంచ్ ఆఫీస్‌లో సమర్పించవచ్చు.

ప్రదేశము : ఆంధ్రప్రదేశ్
తేది : 14.09.2024

సం/-అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 14, సెప్టెంబర్ 2024

అనుమాన స్పంద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-చిప్పగిరి: అనుమాన స్పందన స్థితిలో చిప్పగిరి గ్రామానికి చెందిన కురువ కారమంచప్ప(62) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామానికి చెందిన కురువ కారమంచప్ప గురువారం సాయంత్రం స్వగ్రామమైన చిప్పగిరి నుండి అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణానికి లాంట్రిన్ లో ఇచ్చిన బట్టల కొరకు తన ద్విచక్ర వాహనంలో బయలుదేరి బట్టలు తీసుకొని తిరుగు ప్రయాణంలో గుంతకల్లు దాటిన తర్వాత ఇంటి నుండి ఫోన్ చేసి మన పొలంలో ట్రాక్టర్ గుంటక పోలుగులు ఉన్నవి వాటిని తీసుకొని రమ్మని చెప్పడం జరిగిందని, అయితే రాత్రి 10 గంటలు కావస్తున్నప్పటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలంలోకి వెళ్లి వెతకగా వేప చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడని దీంతో చిప్పగిరి పోలీసులకు సంఘటన జరిగిన విషయం తెలియజేయడం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న చిప్పగిరి ఎస్సై రమేష్ బాబు తో పాటు ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్ శుక్రవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని అనుమానాస్పందముగా మృతి చెందిన కారుమంచప్ప మృతదేహం పరిశీలించి ఈ విషయం పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యకు తెలియజేయడంతో హుటా హుటిన డిఎస్పి వెంకటరామయ్య సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. మృతిని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్ పాత్రికేయులకు తెలిపారు.

ప్రతి వారం లక్ష్య సాధనపై సమీక్షిస్తాం-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : జిల్లా అభివృద్ధికి సంబంధించి వంద రోజుల లక్ష్యాలు కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాష జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు లో వంద రోజులు లక్ష్యాల సాధనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో వంద రోజుల లక్ష్యాలను ఎంతవరకు సాధించారో పూర్తి స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల లక్ష్య సాధనపై ప్రతి వారం మండల వారీగా సమీక్షిస్తామని, ఈ మేరకు జిల్లా అధికారులు ఆయా మండలాల్లో పురోగతిపై కచ్చితమైన విశ్లేషణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో భాగంగా సాయిల్ హెల్త్ కార్డులు, ఈ-పంట, సీసీఆర్ కార్డ్స్ జారీ కి సంబంధించి లక్ష్యాల సాధన లో మంచి పురోగతి చూపారని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అభినందించారు. వివిధ శాఖల సమీక్షలో భాగంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. తగినంత స్థలమున్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కూరగాయలు,ఆకుకూరల పెంపకంతో న్యూట్రి గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.వీటి ఏర్పాటు ద్వారా మధ్యాహ్న భోజనానికి కూరగాయలు, ఆకుకూరలను వినియోగించడం తోపాటు విద్యార్థులకు కూడా చెట్ల పెంపకం పై అవగాహన కలుగుతుందన్నారు. సెరి కల్చర్‌కు సంబంధించి వంద రోజుల్లో లక్ష్యాల కేటాయింపు లో స్పష్టత లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.మత్స్య శాఖకు సంబంధించి పెండింగ్‌లోని 3 ట్యాంకుల్లో విత్తన చేపపిల్లల పెంపకంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.పశు సంవర్ధకశాఖకు గోకులం షెడ్ల నిర్మాణం సంబంధించి త్వరితగతిన లబ్ధిదారులను గుర్తించి, గ్రౌండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు వీలుగా జీవనోపాధుల కల్పనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన యోజన పథకం ద్వారా మునిసిపాలిటీ లో నగరవనం, నగరవాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారిని ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పనకు సంబంధించి వెబ్సైట్ తయారు చేయాలని, రాష్ట్రంలో ఏ సంస్థలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా, ఆ వెబ్సైట్‌లో కనపడేలా లింక్స్, వివరాలను పొందుపరిచేలా రూపొందించాలని,కలెక్టర్ జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారికి సూచించారు. ఈ వెబ్సైట్ లో రిజిస్టర్ అయిన వారికి ఉద్యోగాలకు సంబంధించి ఖాళీలు ఉన్నపుడు ఎస్ఎంఎస్/వాట్సాప్ రూపంలో వారికి సందేశం వెళ్లేలా వెబ్సైట్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంతటా ఒకే విధంగా రోజుకొక కార్యక్రమం జరిగేలా షెడ్యూల్‌ను రూపొందించాలని కలెక్టర్ డీపీవోను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పాఠశాలల్లోనూ, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ లోనూ ఖాళీగా ఉన్న స్థలంలో ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.. రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డు రూముల వద్ద సీసీటీవీలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలీసు అధికారులను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ కు విధి నిర్వహణలో భాగంగా బదిలీలో నూతనంగా వచ్చిన సీఐను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా వేసి పుష్పగుచ్చంతో అభినందించిన టిడిపి నాయకులు. ఇదే కార్యక్రమంలో ఎస్సై నారాయణరెడ్డి, ఎస్సై హుస్సేన్ భాషకు కూడా శాలువా వేసి పుష్పగుచ్చంతో అభినందించారు. ఆత్మకూరు పట్టణ టీడీపీ నాయకులు 11వ వార్డ్ ఇంచార్జ్ అమ్మల్లా, నబీ, షాషా, సయ్యద్, మాలిక్ పాల్గొన్నారు.

చింతలాయపల్లిలో పోలీసుల కవాతు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయపల్లి గ్రామంలో నెల కొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంతో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు మార్చ్ నిర్వహించారు.గురువారం రాత్రి 3 రోడ్ల వద్ద ముగ్గురు వైసీపీ కార్యకర్తల పై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లాగ్ మార్చ్ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు గ్రామ నాయకులు ప్రజలు సహకరించాలని కోరారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సమస్యలు ఏదైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలే తప్ప శాంతి భద్రతలకు విఘాథం కలిగించవద్దన్నారు.

పరుగు పందెంలో సత్తా చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర-హొళగుంద : ఇంగళదహాల్ జడ్పీ హైస్కూల్ ఆవరణంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో నేతాజీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెడ్మాస్టర్ కే గోపీనాథ్ శుక్రవారం తెలిపారు మండలస్థాయి అండర్-14 ఇయర్స్ విభాగం ఆటల పోటీలలో భాగంగా హొళగుంద నేతాజీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు విజేతులయ్యారని అన్నారుమండల స్థాయిలో రన్నింగ్ రేసులో మొదటి స్థానంలో విహర్షిత మరియు రెండో స్థానంలో ఎం.సేవంతి, డిస్క్ త్రో పోటీలో భాగంగా మొదటి స్థానంలో పి.రాజాసాబ్, రెండో స్థానంలో గుల్షన్ అహ్మద్, కబడ్డీ క్రీడలో భాగంగా ఎం.హరికృష్ణ, భరత్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, హెడ్మాస్టర్ గోపీనాథ్, పిఈటి యూసుఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థిగా చదువుకో.. గమ్యాన్ని చేరుకో..!

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు డివిజన్ కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ వారు విద్యార్థి చదువుకో గమ్యాన్ని చేరుకో కార్యక్రమం పోస్టరును జిల్లా ప్రధాన కార్యదర్శి దక్క కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఆర్ రామాంజి నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబోయే విద్యార్థి చదువుకో గమ్యాన్ని చేరుకో విద్యార్థులు జయప్రదం చేయాలని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-బనగానపల్లె: ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ శివశంకరు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగరాజు ఆధ్వర్యంలో ఎంఈఓ ఆఫీస్ సిఆర్పి టీచర్స్ ప్రసాదు, సుధాకర్, డా. శివశంకర్ ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలం లోని అన్ని పాఠశాలలు అంగన్వాడి స్కూళ్లలో 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ అందజేయడం జరుగుతుంది తెలిపారు.

దళిత మహిళ గోవిందమ్మ దాడి ఘటనపై కేసు నమోదు

కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి విలేకరులకు తెలిపారు. బాధితురాలి కుమారుడు ఈరన్న కులాంతర వివాహం చేసుకున్నారనే కుట్రతో గోవిందమ్మపై చాకలి నాగలమ్మ కుటుంబీకులు, మరికొందరు దాడికి పాల్పడినట్లు తెలిపారు. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు చాకలి నాగలమ్మ కుటుంబీకులు భూలక్ష్మి, నర్సమ్మ, ఉసేనమ్మ, లక్ష్మి, రంగమ్మ, నాగరాజు, ఉసేని, రాముడు, బీమారాజు, గుండమ్మతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిని గోకులాలకు 148 దరఖాస్తులు

విశాలాంధ్ర-కల్లూరు: మండల వ్యాప్తంగా 148 మంది అభ్యర్థులు మిని గోకులాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తామని చిన్నటేకూరు పశువైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ఆయన రైతులు అందించిన మిని గోకులాల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 148 మంది రైతులు పశువులను పెంచి పోషించుకునే వారు తమకు షెడ్లు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని, దరఖాస్తులను మంజూరు కోసం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి పంపడం జరిగిందని మంజూరైన తర్వాత లబ్ధిదారులతో పనులు ప్రారంభిస్తామని యూనిట్ కాస్టు రెండు లక్షల ఇరవై మూడు వేలు రూపాయలు అయితే లబ్ధిదారుడు ముందస్తుగా 23 వేల రూపాయలు డిడి తీయాల్సి ఉంటుందని గతంలో మాదిరే విడతల వారీగా నిర్మాణం చేపట్టి బిల్లులు పొందాల్సి ఉంటుంద ని ఆయన పేర్కొన్నారు.ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

హొన్నూరులో అంగన్వాడి కేంద్రం ప్రారంభించండి

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని హొన్నూరులో అంగన్వాడి కేంద్రం ప్రారంభించాలని ప్రజలు శుక్రవారం డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలు లేక విద్యార్థులు ఆటపాటల్లో నిమగ్నులై సమయాన్ని వృధా చేస్తున్నారని వాపోయారు. పేరుకి పంచాయితీ కేంద్రమైన ఇంతవరకు అంగన్వాడి కేంద్రంలేక గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. హొన్నూరు కొట్టాల నుండి అంగన్వాడి టీచర్ పౌష్టిక ఆహారాన్ని, గుడ్లు, చిక్కీలను అందిస్తున్నారని ఏమైనా సమస్యలు ఉంటే తీర్చుకోవడానికి 3 కి.మీ.లోని గ్రామాలకు వెళ్లి సమస్యలను తీర్చుకుంటున్నామని ప్రజలు పేర్కొన్నారు. గ్రామంలో అంగన్వాడి కేంద్రం ప్రారంభిస్తే మహిళలతో పాటు పిల్లలు ఆరోగ్యానికి నాణ్యమైన పౌష్టిక ఆహారం దొరుకుతుందని అందుకోసం జిల్లా ఐసిడిఎస్ అధికారి శ్రద్ధ వహించి కొత్తగా అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

సీఐని కలిసిన కురుకుంద నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : నూతన సీఐను మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్చంతో అభినందించిన కురుకుంద గ్రామ టిడిపి నాయకులు బాబు, మధు, ఫక్రుద్దీన్, జోరమన్‌లున్నారు.

జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి-జిల్లా కలెక్టర్



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: జాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో " నైపుణ్యం అభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో సెప్టెంబరు 20వ తేదిన కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ కళాశాలలో జాబ్ మేళాను ఏర్పాటు చేయనున్నారని, ఇందులో వివిధ రకాలైన 06 ప్రైవేటు కంపెనీలలో ఉన్న 500 ఖాళీలను భర్తీ చేయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. సదరు జాబ్ మేళాలో పాల్గొనాలనుకునే యువతి, యువకులు 18 సంవత్సరముల నుండి 35 సంవత్సరముల లోపు ఉండడంతో పాటు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ మరియు పీజీ చదివిన వారు జాబ్‌మేళాలో ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. సదరు వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి డిఆర్ఓ చిరంజీవి, సీపీవో హిమ ప్రభాకర రాజు, డీఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీం భాష, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోని పుటకలమర్రి గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కోఆర్డినేటర్ ఆనంద్ రావు గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడ పోటీలను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షమీల, ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఫణీంద్ర లు పాల్గొని కబడ్డీ, కోకో ఆటలలో పాల్గొని విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అండర్14 మరియు అండర్ 17 బాల, బాలికల క్రీడా పోటీలు వాలీబాల్, కోకో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో లో సెలెక్ట్ అయినటువంటి విద్యార్థిని, విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో ఆడటం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు జాషువా ఫౌండేషన్ అధ్యక్షుడైన దేవేంద్రయ్య, మాజీ సర్పంచ్ నాగరాజు లు భోజన వసతి కల్పించడం జరిగింది తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం ఫిజికల్ డైరెక్టర్స్ లు రంగస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, లతీఫ్, విజయ్ కుమార్, రామంజి, అంజి, రాజేశ్వరి, మహేంద్ర, రాము విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సద్గురు దక్షిణామూర్తి స్వామి రథోత్సవం

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోని కారుమంచిలో కొలిచేవారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీ సద్గురు దక్షిణామూర్తి స్వామి రథోత్సవాన్ని ఆశేష జనవాహిని మధ్య శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి ప్రభాత సేవ, గంగాపూజ, సద్గురు సమాధికి పంచామృతాభిషేకం, గాయత్రీ మాత మహాయజ్ఞం, ఆకు పూజ మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శివారెడ్డి ఇంటి నుండి కుంభోత్సవంతో స్వామివారి దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం రథోత్సవంలో దక్షిణామూర్తి స్వామి విగ్రహాన్ని కూర్చోబెట్టి స్వామివారి ఆలయం నుండి శివాలయం ఆలయం వరకు అశేష జన సమూహం మధ్య రథోత్సవాన్ని లాగారు. రథోత్సవ వేడుకలలో నేమకంటి బొమ్మలు, గురవయ్య నృత్యలు, కోలాటం ఆటపాటలు ఎంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు వచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి భజన పోటీలు నిర్వహించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా సిఐ మస్తాన్ వలి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు మురళీధర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రకళ, రాజన్న గౌడ్, కౌలుట్లయ్య, మాజీ ఎంపీటీసీ రంగస్వామి, గ్రామ పెద్దలు రవిరెడ్డి, వెంకటేష్, ఆంజనేయ, వీరభద్రి, దరగయ్య, గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం ఊరేగింపులో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-బళ్లారి చౌరస్తా: గణేష్ నిమజ్జనం ఊరేగింపు సమయంలో నగరంలో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లు,ఓ అండ్ ఎం. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం. ఉమాపతి సూచించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ లో ఆదివారం జరగనున్న గణేష్ నిమజ్జనం గురించి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ డ్యూటీ ఇంజనీర్స్, ఓ అండ్ ఎం స్టాఫ్ తో సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.ఉమాపతి , కర్నూలు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శేషాద్రి లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ గణేష్ ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అంతరాయాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర జరుగు కూడలి,మెయిన్ రోడ్లలో వర్టికల్ క్లియరెన్స్, 11 కెవి ఎల్‌టి లైన్స్ అవసరమైతే ఎమర్జెన్సీగా ఆఫ్ చేసి విగ్రహాలను దాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం కంప్లీట్ అయ్యే వరకు ప్రతి వినియోగదారుడికి సప్లై ఇంట్రప్షన్ లేకుండా అందరికీ ప్రతి స్టాఫ్ డ్యూటీలోనే ఉండాలని కోరారు.స్టాఫ్ తమ యొక్క టీపి టూల్స్, హెల్మెట్ గ్లౌజు ఫీజు వైరు ఎర్త్ రాడ్స్, మరియు టార్చ్ లైట్ ఉంచుకోవాలన్నారు. ఐడి కార్డ్స్ ఆఫ్రాన్ లు ధరించాలని,మినిట్ టు మినిట్ ఇన్ఫర్మేషన్ ఇంట్రప్షనుపై అధికారులకుతెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డి1 డిఈ ఈ, నాగ ప్రసాద్ -2 డి ఈఈ, రాజేంద్ర కర్నూలు రూరల్ డివిజన్ డి ఈ ఈ సుబ్బన్న,కర్నూలు టౌన్ డివిజన్ ఏఈలు స్టాఫ్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలి

విశాలాంధ్ర-కర్నూలు క్రైం : కర్నూలులో ఆదివారం గణేష్ నిమజ్జన ఉత్సవం సంధర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భారీ బందోబస్తు చర్యలు చేపట్టిందని, ప్రశాంత వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బందోబస్తు వివరాలను వెల్లడించారు. అడిషనల్ ఎస్పీ ఒకరు, 11 మంది డిఎస్పీలు, 58 మంది సిఐలు/ ఆర్ ఐలు, 133 మంది ఎస్సైలు / ఆర్ ఎస్సైలు, 346 మంది ఎఎస్సై మరియు హెడ్ కానిస్టేబుల్స్, 642 మంది పోలీసు కానిస్టేబుల్స్ , 34 మంది మహిళా పోలీసులు, 464 మంది హోంగార్డులు, 6 సెక్షన్ల ఎర్ సిబ్బంది, 15 స్పెషల్ పార్టీ బృందాలు, కర్నూలు జిల్లాతో పాటు అన్నమయ్య, కడప, నంద్యాల జిల్లాల నుండి మొత్తం 1,689 మంది పోలీసులను భారీ సంఖ్యలో మోహరింపజేశామన్నారు. నిబంధనలకు ఎవరు విరుద్ధంగా ప్రవర్తించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు, నిమజ్జనం కార్యక్రమం అంతా డ్రోన్, సిసికెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకీరిస్తాం, అసాంఘిక శక్తులు, అల్లరి మూకల పై గట్టి నిఘా ఉంచుతాము. విగ్రహాలు బయలు దేరేటప్పుడు కరెంటు తీగల వద్ద గణేష్ నిర్వహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి.

విగ్రహాలను తరలించడానికి ముందురోజే వాహనాలను మరియు క్రేన్ లను సిద్ధంగా ఉంచుకోవాలి.చిన్న పిల్లలు నిమజ్జన ఊరేగింపు వాహనాలకు దూరంగా ఉండాలి. నిమజ్జన ఘాట్ల దగ్గర కు నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే మహిళలు, వృద్దులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి.

విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయములో ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహారించరాదు .

ఆసుపత్రుల దగ్గర హోరెత్తించే డిజేలతో రోగులకు ఇబ్బందులు కలిగించరాదు.

హోరెత్తించే లౌడ్ స్పీకర్లు, డిజేలతో అధిక శబ్దాలతో ఆకతాయిలు మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం.

మతపెద్దలు, రాజకీయ పార్టీలు, శాంతి కమీటి సభ్యులు, యువత, శాంతియుత వాతావరణంకు సహకరించాలని, మీడియా కూడా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నిమజ్జనం సంధర్బంగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్ళింపు....

వాహనచోదకులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహాకరించాలి.

గణేష్ నిమజ్జనం సంధర్భంగా సెప్టెంబర్ 15 వ తేది ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గణేష్ నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు నగరంలో ట్రాఫిక్ ను మళ్లించినట్లు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపారు.

అత్యవసర (108, ఫైర్ , అంబులెన్సులు, పోలీసు వాహనాలు) సేవల కోసం పోలీసు వారితో అనుమతి పొందిన వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతిస్తారు.

స్వచ్ఛతాహి సేవను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా భగిదారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష, మొక్కలు నాటడం, తదితర కార్యక్రమాలు గ్రామ పంచాయతీలో సర్పంచుల ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో 14 రోజులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్ డి మహేంద్రరెడ్డి, ఏపీఓ రవిప్రకాష్ లు పాల్గొన్నారు.

ఈనెల 15 లోపు పంట నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండలంలోని ఉప్పులూరు, బి తాడపత్రి గ్రామాలలో సాగుచేసిన ఉద్యాన పంటలను ఉద్యాన శాఖ అధికారిని ధరణి శుక్రవారం పరిశీలించారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ అధికారిని స్నేహలతతో కలిసి ఆయా గ్రామలలో రైతులు సాగుచేసిన మిరప, చీని తదితర పంటలను పరిశీలించడంతోపాటు పంట నమోదు పై ధరణి ఆరా తీశారు. పంటల సాగుపై రైతులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగుచేసిన పంటలకు ఈనెల 15 లోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట వేసిన ప్రతిరైతు తమ పరిధిలోని ఆర్బికే కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.పంట నమోదు వలన ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం,ఇన్పుట్ సబ్సిడీ, ఇతర పథకాలు వర్తిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సాగుచేసిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా మాండ్ర గిడ్డారెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర-నందికొట్కూరు : మండల పరిధిలోని అల్లూరులో టిడిపి నాయకులు మాండ్ర శివానందరెడ్డి తండ్రి స్వర్గీయ మాండ్ర గిడ్డారెడ్డి వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర లింగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ఎంపియుపి స్కూల్ నందు మరియు ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ నందు విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, సున్నం పల్లె శ్రీనివాసులు, స్కూల్ కమిటీచైర్మన్ మౌలాలి, సయ్యద్, చిన్న రాజు, డీలర్ చెన్నయ్య, ప్రవీణ్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జల కేంద్రం పునః ప్రారంభం

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లిలో అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించిన శుద్ధ జల కేంద్రాన్ని అధికారులు నాయకులు శుక్రవారం పునఃప్రారంభించారు. గ్రామస్తులకు శుద్ధజలాన్ని అందించేందుకు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో పదేళ్ల కిందట అల్ట్రాటెక్ ఆధ్వర్యంలో ప్లాంటును ఏర్పాటుచేసిన కొన్ని నెలలకే శుద్ధజల కేంద్రం మూతపడడంతో అప్పటినుండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన వెంటనే సమస్యను అల్ట్రాటెక్ అధికారుల దృష్టికి తీసుకోవడంతో వారు స్పందించి ప్లాంటుకు మరమ్మతులు చేయించి 5000 లీటర్ల నీటి సామర్థ్యంతో కేంద్రాన్ని మళ్లీ పున ప్రారంభించారు. కూటమి నాయకులు గండా పరమేశ్వర్‌రెడ్డి, పత్తి సురేష్‌బాబు, కెవి నాగేంద్ర, సుధాకర్,శ్రీరాములు,ప్రసాద్, రాంబాబు, హుస్సేన్,నరసింహ,ప్రవీణ్ తదితరులు అల్ట్రాటెక్ అధికారులతో కలిసి ప్రారంభించారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-చాగలమర్రి: చిన్నారులు,గర్భిణీలు,బాలింతలకు అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టిక ఆహారం అందిస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో తేజేశ్వరి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా చాగలమర్రిలోని పాతబస్టాండ్ వీధిలోని 13 వ అంగన్‌వాడీ సెంటర్లో కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు వుండే తృణ ధాన్యాలు ఉపయోగించే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, సిట్రస్ ఫ్రూట్స్ ఆహారంలో తీసుకోవాలని తెలిపారు.ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల, హెల్త్ సూపర్వైజర్ రాంలింగారెడ్డి,జిఎంఎస్‌కే జగదీశ్వరి,ఏఎన్ఎం లీలావతి, అంగన్వాడి కార్యకర్తలు రెహనా, పద్మావతి, నాగమణి, సంజీవమ్మ, అనురాధ, రజని, కళావతి, పద్మావతి, నాగలక్ష్మి,జ్యోతి లు పాల్గొన్నారు.

కౌలు వేలం పాటల్లో రూ 1.16 లక్షల ఆదాయం

విశాలాంధ్ర-రుద్రవరం: మండల పరిధిలోని పేరూరులో వెలసిన ఈశ్వరస్వామి ,రామస్వామి ఆంజనేయ స్వామి, దేవాలయ భూముల కౌలు వేలం పాటలో రూ 1.16 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నరసయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మూడు దేవాలయాలకు సంబంధించి 80.32 ఎకరాల భూములకు కౌలు వేలంపాటలు నిర్వహించగా గత ఏడాది రూ 6.15 రాగ ఈ ఏడాది రూ 7.31 లక్షల వచ్చిందన్నారు. ఈ వేలం పాటల్లో ఈవోలు చంద్రుడు, సాయి జయచంద్ర రెడ్డి, సీఐ హనుమంత నాయక్, ఎస్ బి సిఐ మోహన్ రెడ్డి, ఎస్సైలు వరప్రసాద్, హరి ప్రసాద్, వీఆర్వో నీలకంఠేశ్వరరావు, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

'టెలికాం సలహా కమిటీ సభ్యుడుగా కురువ రమేష్

విశాలాంధ్ర-పాములపాడు : భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బి ఎస్ ఎన్ఎల్)కు సలహా నూతన కమిటీ సభ్యులుగా మండల టిడిపి యువ నాయకుడు కురువ రమేష్ నియమికులయ్యారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ టెలికాం సంస్థ సలహా మండలి ఐదుగురు సభ్యుల్లో ఒకరిగా నన్ను నియమించినందుకు ఎంతో ఆనందంగా ఉందని తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఈ గురుతర బాధ్యత నాకు అప్పగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఎంపీ శబరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నమోదుకు మరొక అవకాశం

విశాలాంధ్ర-బనగానపల్లె: పంట నమోదు ప్రక్రియ నేటితో ముగిసినప్పటికీ ప్రభుత్వం మరొక్క అవకాశం కల్పించిందని, రైతులు తమ ఆధార్ కార్డ్, పొలం పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ తీసుకొని రైతు సేవ కేంద్రంకు వెళ్లి పంట నమోదు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు.పంట నమోదు చేయించుకున్న వారు తమ ఆధార్ కార్డు తీసుకొని వచ్చి వెలి ముద్రవేసి ఈ కేవైసీ ప్రక్రియ కూడా పూర్తి చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ రెండు ప్రక్రియలు పూర్తి చేసుకుంటేనే పంట కొనుగోలు(మద్దతు ధర), క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారం రైతులకు అందుతుందని తెలిపారు.

సీఐని కలిసిన కురుకుంద నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : నూతన సీఐను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో అభినందించిన కురుకుంద గ్రామ టిడిపి నాయకులు బాబు, మధు, ఫక్రుద్దీన్, జోరమన్‌లున్నారు.